క్లుప్తంగా

బాణసంచా కేంద్రం వద్ద జాగ్రత్తలు తప్పనిసరి



బాణసంచా కేంద్రంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఏలూరు టౌన్: ఏలూరు పరిసర ప్రాంతాల్లో బాణసంచా కేంద్రాల్లో పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని, అగ్ని ప్రమాదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ గాయత్రి, ఏలూరు అగ్నిమాపక శాఖ అధికారి రామకృష్ణ హెచ్చరించారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలు, డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ సూచనలతో ఏలూరు జాతీయ రహదారి నోవా ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలోని బాణసంచా కేంద్రాన్ని ఎస్సై నాగబాబు ఆధ్వర్యంలో పోలీస్, అగ్నిమాపక, రెవెన్యూ అధికారులు గురువారం సాయంత్రం తనిఖీలు చేశారు. బాణసంచా నిల్వ కేంద్రాల వద్ద చేపట్టాల్సిన జాగ్రత్తలను నిర్వాహకులకు వివరించారు. ఈ కేంద్రాల వద్ద అగ్నిమాపక రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సీసీ టీవీలు ఏర్పాటుచేయాలని సూచించారు. ఈ కేంద్రాల్లో 18 ఏళ్లలోపు వారిని పనిలో పెట్టుకోకూడదన్నారు.

పెట్టుబడులపై అవగాహన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో వరల్డ్ ఇన్వెస్టర్స్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా అతిథి ఉపన్యాస కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎంబీఏ విభాగంలోని ఫైనాన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సెబీ, సీడీఎస్ఎల్ సహకారంతో రిసా – రీజినల్ ఇన్వెస్టర్స్ సెమినార్ ఆన్ అవేర్‌నెస్ అనే అంశంపై సీడీఎస్ఎల్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ వి.శివ ప్రసాద్, ఎస్ఆర్ఆర్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ ఓలేటి ఏఆర్ కిశోర్ ముఖ్యవక్తలుగా మాట్లాడారు. కళాశాల కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు తదితరులు పాల్గొన్నారు.

జగన్ యాత్ర విజయవంతం



గారపాటి నాగేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనకాపల్లి పర్యటనకు ఎన్ని అడ్డంకులు సృష్టించాలని ప్రయత్నించినా ప్రజా అభిమానం ముందు అవన్నీ నీరుగారిపోయాయని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు గారపాటి నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో జగన్‌కు ఉన్న ప్రజా అభిమానాన్ని చూసి కూటమి నాయకులు ఓర్వ లేక పోతున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో తిరిగి వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని చెప్పారు. మళ్లీ వైఎస్ జగన్ 2.0 పరిపాలన ప్రారంభం అవుతుందని, పేదలకు తిరిగి మంచి రోజులు వస్తాయనే ఆశాభావాన్ని గారపాటి వ్యక్తం చేశారు.

ఏలూరులో కానరాని స్వచ్ఛత

- నగరంలో ఎక్కడి చెత్త అక్కడే
- డ్రెయిన్లలో పేరుకుపోయిన సిల్టు
- రోడ్లపైకి వస్తున్న మురుగు నీరు
- స్వచ్ఛాంధ్ర అవార్డుల పేరిట ప్రభుత్వం హడావిడి



అశోక్‌నగర్‌లోని ఖాళీ స్థలంలో పసర్లు పట్టిన నీరు



ద్వారకా నగర్‌లో చెత్త కుప్ప



లునాని నగర్‌లో డ్రెయినేజీ పూడుకుపోయి రోడ్డుపైకి చేరిన మురుగు నీరు



డీసీసీబీ బ్యాంకు సందులో ఎల్ఐసీ ఆఫీసు ఎదుట రోడ్డుపై చేరిన డ్రెయినేజీ నీరు

ఏలూరు (టూటౌన్): స్వచ్ఛాంధ్ర అవార్డుల పేరిట కూటమి ప్రభుత్వం తన పాలనా వైఫల్యాలు, లోపాల నుంచి ప్రజలను డైవర్ట్ చేయడానికి ప్రయత్నిస్తోంది. ఒకపక్క జిల్లాలో అభివద్ధి పనులకు నిధులివ్వడం లేదు. మరోపక్క రహదారులన్నీ గుంతలమయంగా మారాయి. రోడ్లపై ఎక్కడికక్కడ చెత్త దర్శనమిస్తున్నా, అవార్డుల పేరిట హడావిడి చేస్తోంది. జిల్లాలోని ఏకైక నగరపాలక సంస్థ ఏలూరు. ఏలూరులో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో డివైడర్‌లకు రంగులు వేయడం, కాలువ గట్ల వెంబడి మొక్కలు నాటడం, రోడ్లను తుడిచినట్లు ఫొటోలకు ఫోజులు ఇవ్వడం మినహా ఒనగూరిన ప్రయోజనం ఏమీ లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో నగరంలో ఏదో ఒక కార్యక్రమం చేపట్టడం, అధికారులు, ప్రజాప్రతినిధులు ఫొటోలకు ఫోజులు ఇవ్వడం పరిపాటిగా మారింది. డ్రెయిన్లలో షిల్టు ఎప్పటికప్పుడు తీయకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతుంది. ఇదీ ఏలూరు నగరపాలకసంస్థ పరిధిలో నిత్యం కనిపించే దృశ్యాలు.

దోమలకు నెలవుగా డ్రెయినేజీలు

నగరంలో డ్రెయిన్లలో సిల్టు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఇవి దోమలకు ఆవాసంగా మారాయి. దోమల కారణంగా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. దోమల నివారణకు అవసరమైన చర్యలు నగరపాలక సంస్థ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రెండో పట్టణ ప్రాంతంలో హోటల్స్, రెస్టారెంట్లు ఎక్కువగా ఉన్నాయి. వీటి పరిధిలో వినియోగించే మురుగు నీరు, చెత్తా చెదారం అంతా డ్రెయిన్లలోకి వదిలేస్తున్నారు. దీంతో డ్రెయిన్లు పూడుకుపోతున్నాయి. నగరపాలక సంస్థ సిబ్బంది డ్రెయిన్లలో సిల్టు తీసినా, మళ్లీ కొద్ది రోజులకే అవి పూడుకుపోతున్నాయి. నగరపాలక సంస్థ అధికారులు స్పందించకపోవడంతో హోటల్స్, రెస్టారెంట్ల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఎక్కడి చెత్త అక్కడే

ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లు, 79 సచివాలయాల పరిధిలో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తుంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా సిబ్బంది సంఖ్యను పెంపుదల చేయకపోవడమే దీనికి ప్రధాన కారణంగా ఉంది. చాలీచాలని సిబ్బంది, క్లాప్ ఆటోల రద్దుతో నగరంలో చెత్తను పూర్తిస్థాయిలో తొలగించలేకపోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. స్వచ్ఛ ఆంధ్ర పేరిట ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్న పాలకులు సిబ్బంది పెంపుదల విషయంలో మీన మేషాలు లెక్కించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

శుభ్రం చేయించాలి



నగరంలోని అన్ని మురుగు డ్రెయిన్లను శుభ్రం చేయించాలి. వర్షాలు కురిసిన సమయంలో ఇబ్బంది లేకుండా డ్రెయిన్లను శుభ్రం చేస్తే బాగుంటుంది. లేని పక్షంలో వర్షాకాలంలో కొద్దిపాటి చినుకులకే మురుగు నీరు రోడ్లపైకి చేరి దుర్గంధం వెదజల్లుతుంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.

– పిచ్చుక ఆదిశేషు, చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్, ఏలూరు

మొక్కుబడిగా పనులు



కొద్ది నెలల కిందట నగరంలోని పలు రోడ్లను బాగు చేశామంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు ఫొటోలకు ఫోజులిచ్చారు. ఆరు నెలలు తిరక్కుండానే రోడ్లపై గోతులు యథావిధిగా ప్రత్యక్షమయ్యాయి. నేతలు చెప్పేదానికి, చేసే దానికి సంబంధం లేకుండా ఉంది. ఇప్పటికైనా పక్కాగా రోడ్లను బాగుచేయాలి.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఏలూరు

గాజాపై మారణహోమానికి వ్యతిరేకంగా ర్యాలీ



ధర్నా చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): స్వతంత్ర దేశమైన పాలస్తీనా గాజా ప్రజలపైన అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణ హోమాన్ని ఆపాలని డిమాండ్ చేస్తు ఏలూరులో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం భారీ, ర్యాలీ ధర్నా నిర్వహించారు. గాజా పైన యుద్ధాన్ని ప్రారంభించి అక్టోబర్ 7కు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, పార్టీ కేంద్ర కమిటీ పిలుపుమేరకు గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు. వైఎంహెచ్ఏహాల్ సెంటర్ నుంచి కన్నయ్య పార్క్, మెయిన్ బజార్, పెద్ద వంతెన మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీనిర్వహించారు. అక్కడ జరిగిన సభలో సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు యు.వెంకటేశ్వరరావు, ఏలూరు నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఐఎఫ్‌టీయూ నాయకులు బి.సోమయ్యలు మాట్లాడారు. ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకొని, యుద్ధాన్ని ఆపాలని, భారత ప్రభుత్వం కూడా పాలస్తీనాకు అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమానికి ఐఎఫ్‌టీయూ నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. అమెరికా, ఇజ్రాయిల్ వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.



కాన్షీరామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కాన్షీరామ్‌కు నివాళి

ఏలూరు (టూటౌన్): దేశంలోనే ప్రభంజనం సృష్టించిన ఘనత మాన్యశ్రీ కాన్షీరామ్‌కే దక్కుతుందని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక ఎన్ఆర్‌పేటలోని ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం మాన్యశ్రీ కాన్షీరామ్ 19వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సంతోష్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను నూరుశాతం అమలు చేసిన వ్యక్తి కాన్షీరామ్ అని కొనియాడారు. ఉత్తరప్రదేశ్‌లో నాలుగు సార్లు అధికారంలో రావడానికి కారకులయ్యారని వివరించారు. ఓట్లు మావి.. సీట్లూ మావే అని నినదించిన మహోన్నత వ్యక్తి కాన్షీరామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు సిర్రా భరత్, నాయకులు పాము మాన్ సింగ్, అంబటి నాగేంద్ర, కనికెళ్ల మురళి, తెనాలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తిదాయకుడు చేగువేరా

కుక్కునూరు: యువతకు చేగువేరా స్ఫూర్తిదాయకుడని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి అన్నారు. గురువారం చేగువేరా 58వ వర్ధంతి సందర్భంగా సీఐటీయూ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ విప్లవ భావజాలానికి యువతకు చేగువేరా యూత్ ఐకాన్ అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మోడియం నాగమణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బుయ్యాన శ్రీను, గిరిజన సంఘం మండల కార్యదర్శి పట్ల లక్ష్మయ్య, సీఐటీయూ నాయకులు పోచారపు వెంకటేశ్వర్లు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

భీమడోలు: బాల్య వివాహాలను అరికడదాం–భవిష్యత్తును కాపాడుకుందాం అనే నినాదంతో గురువారం పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం గ్రామంలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ (క్రాఫ్) ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. బాల్య వివాహాల రహిత దేశంగా చేసేందుకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మహిళా సంరక్షణ కార్యదర్శి పి.లక్ష్మీ సుజనా మాట్లాడారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలను చేపడితే చైల్డ్ లైన్ 1098కు ఫోన్ చేయాలని కోరారు. మైనర్లకు వివాహాలు చేస్తే బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో క్రాఫ్ సిబ్బంది చంద్రకళ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

పెదవేగి: మండలంలోని రాట్నాలకుంటలో శ్రీరాట్నాలమ్మ దేవస్థానంలో జరిగిన నూతన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పూజల అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదం, చిత్ర పటాలను, ఆలయ అర్చకులు నిర్వాహకులు ఎమ్మెల్యేకు అందజేశారు.

బాలోత్సవం నిర్వహణ అభినందనీయం



బ్రోచర్ విడుదల చేసిన డీఈఓ, వివిధ సంఘాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పిల్లల మానసిక వికాసం కోసం నగరంలోని వివిధ సంస్థలకు చెందిన అనేక మంది పెద్దలు హేలాపురి బాలోత్సవం పేరుతో ఆరేళ్లుగా చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ అన్నారు. గురువారం స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో బాలోత్సవం ఆహ్వాన సంఘం కమిటీ సభ్యులతో కలిసి హేలాపురి బాలోత్సవం పిల్లల సంబరాలు ఆరవ కార్యక్రమం బ్రోచర్ని డీఈఓ విడుదల చేశారు. విద్యాశాఖ తరపున తమ వంతు ప్రోత్సాహం అందజేస్తామని ఆమె హామీ ఇచ్చారు. బాలోత్సవం ఆహ్వాన సంఘ అధ్యక్షుడు అలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ పిల్లల సంబరాలు డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో వట్లూరులోని సిద్ధర్థ క్వెస్ట్ స్కూల్‌లో నిర్వహించనున్నట్టు చెప్పారు. రిటైర్డ్ ఎంఈఓ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ నవంబర్ 9న చిన్న పిల్లల అంశాలు, చిత్రలేఖనం విభాగాల్లో ప్రతిభా ప్రదర్శన, డిసెంబర్ 12, 13 తేదీల్లో జరిగే అకడమిక్, కల్చరల్ విభాగాల్లోని 50 అంశాలలో ఏలూరు పరిసరాల్లోని 8 మండలాలకు సంబంధించిన 250 స్కూల్స్ విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఆహ్వాన సంఘం నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, వివిధ సంఘాల ప్రతినిధులు ఎ.మోహిని, మేతర అజయ్ బాబు, పి.ఆంజనేయులు, పవీజీ సత్యవాణి, ఎస్‌వీఎస్ సోమయాజులు, పి.కస్తూరిబాయి, పి. రవీంద్రనాథ్, జి.రాంబాబు, పి.కనకదుర్గ, వై.నిర్మల, పీఎస్ శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు, ఎన్ గంగాభవాని, ఎ.వెంకట సుబ్బారావు, కె.జనని, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రగాఢ సానుభూతి



ఫణి ఇంద్రకు నివాళులర్పిస్తున్న జేపీ, నేతలు



సత్యనారాయణకు నివాళులర్పిస్తున్న జయప్రకాష్

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం ఏలూరు నగర అధ్యక్షుడు యర్రా రాంబాబు సోదరుడి భార్య యర్ర ఫణి ఇంద్ర గురువారం మృతిచెందారు. ఆమె మృతదేహానికి పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. నాయకులు గుడిదేశి శ్రీనివాసరావు, నెరుసు చిరంజీవి, మున్నుల జాన్‌గురునాథ్, గాజుల బాజీ, కొల్లిపాక సురేష్, బండ్లమూడి సునీల్, ఎచ్చెర్ల ఉమామహేశ్వరరావు, బసవ, నగర కార్యదర్శి ఎక్కల నాని తదితరులు పాల్గొన్నారు.

- ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు హంసల బుజ్జమ్మ భర్త వెంకట సత్యనారాయణ చిత్ర పటానికి జేపీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుజ్జమ్మ కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని జేపీ తెలిపారు. పార్టీ నేతలు శ్రద్ధాంజలి ఘటించారు.

మానసిక ఆరోగ్యంతోనే ఉన్నత విద్య

ద్వారకాతిరుమల: విద్యార్థులు మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా మానసిక కౌన్సెలర్ ఎమ్.సుధీర్ కుమార్ అన్నారు. మండలంలోని తిరుమలంపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వరల్డ్ మెంటల్ హెల్త్ వీక్‌లో భాగంగా ఏపీసీ పంకజ్ కుమార్, జీసీడీఓ బి.నవీన ఆదేశాల మేరకు, పాఠశాల సహ ప్రధానోపాధ్యాయులు యు.ఫణికుమార్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సును నిర్వహించారు. సుధీర్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు వినూత్నంగా ఆలోచిస్తూ, ఉపాధ్యాయుల నుంచి కొత్త విషయాలు నేర్చుకోవాలని, నాణ్యమైన ఆహారం తీసుకోవాలని, భావోద్వేగాలను అదుపులో ఉంచుకుంటూ సత్ప్రవర్తన అలవరచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డును నిర్మించాలి

జంగారెడ్డిగూడెం: బుట్టాయగూడెం రోడ్ సీపీఐఎంఎల్ ఆఫీసు నుంచి నాగదేవత గుడి వరకు రోడ్డు వేయాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. గురువారం జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. రమణ మాట్లాడుతూ పదేళ్లుగా ఈ రోడ్డు వేయాలని ప్రజా ప్రతినిధులకు మున్సిపల్ కమిషనర్లకు చైర్ పర్సన్లకు అనేక విజ్ఞప్తులు చేశామన్నారు. ఇది మినీ బైపాస్ రోడ్డుగా ఉంటుంది అటు బుట్టాయగూడెం నుంచి వచ్చే వారికి సుబ్బంపేట వెళ్లాలన్నా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలన్నా ఈ రోడ్డు కీలకమన్నారు. అటువంటి రోడ్డును వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ నాయకులు మంచిలి రాజు, మల్లేటి శ్రీనివాస్, షేక్ బాజీ, మరపట్ల బాబురావు, పీఓడబ్ల్యూ నాయకులు పాల్గొన్నారు.

లోగ్రేడ్ పొగాకుకు కనీస ధర కల్పించాలి

బుట్టాయగూడెం: లోగ్రేడ్ వర్జీనియా పొగాకుకు కిలో రూ.300 ధర కల్పించాలని, ప్రత్తి, మొక్కజొన్న, వరి, బొబ్బర, జీడిమామిడి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుట్టాయగూడెం ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం ఆ సంఘ మండల మహాసభ వెట్టి వీరయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ లోగ్రేడ్ పొగాకుకు కిలో రూ.100 లోపు ధర ఇవ్వడం వలన పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షులుగా వెట్టి వీరయ్య, కార్యదర్శిగా కోర్సా జలపాలుతో పాటు మరికొంత మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కోర్సా జలపాలు, బొడ్డు రాంబాబు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

చింతలపూడి: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని నూజివీడు ఉప విద్యాశాఖాధికారి పీఎస్ సుధాకర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో మండల స్థాయి క్రీడా పోటీలను సుధాకర్ గురువారం ప్రారంభించారు. మండల విద్యాశాఖ అధికారి ఎస్.కిరణ్ కుమార్ వాలీబాల్ కోర్టును ప్రారంభించారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో కూడ ప్రావీణ్యం సంపాదించాలన్నారు. 9, 10 తేదీలలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ కన్వీనర్ పిట్టా వేణు తెలిపారు.

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

చింతలపూడి: ఏపీ అనధికార లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ పథకాన్ని వినియోగించుకోవాలని నగర పంచాయతీ కమీషనర్ ఎ రాంబాబు విజ్ఞప్తి చేశారు. గురువారం నగర పంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 30.06.2025కు ముందు ప్లాట్లు కొని ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు క్రమబద్ధీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్క అనధికార లేఅవుట్, ప్లాట్ యజమానులు ఈ నెల 23 వ తేదీ లోగా తమ స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలని హెచ్చరించారు.

పేకాట శిబిరంపై దాడి

పెదవేగి: మండలంలోని భోగాపురం గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. 10 మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.91,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సీహెచ్ రాజశేఖర్ తెలిపారు. సీఐ తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారు. జూదరులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	27	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	00	బిళ్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	34
బెండకాయలు	24	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	50	కంద	00
కాకర కాయలు	34	బీట్‌రూట్	50
బీరకాయలు	34	కీరా దోస	44
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	26	అల్లం	70–90
క్యారెట్	56–48	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	36	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	22	చుక్కకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07–10
దోసకాయలు	28	పుదీనా	05
ఆనబకాయ (1)	25–30	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	16
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	13
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	18
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	25
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు – తిరుపతి	16.00	4830	34